

మే డేను జయప్రదం చేయండి : సీపీఎం

గాంధారి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే డేను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండలకేంద్రంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మోతిరాం నాయక్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని గంటలు తగ్గించుకోవడం కోసం చికాగో నగరంలో సాగిన పోరాటంలో అనేక మంది కార్మికులు, కర్షకులు అసువులు బాసారని, ఆ పోరాటంలో నేలకు ఒరిగారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి కిషన్‌రావు, ప్రకాష్, సాయిలు, వసంత రావు, మోతిరాం, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

రైతులు పంటలను పుష్కలంగా సాగు చేయాలి

● మహేశ్వరి, మండల వ్యవసాయాధికారి, జుక్కల్



ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ కొను గోళ్ల కేంద్రాలలో రైతులు ఎన్ని క్వింటాళ్ల వరకు ధాన్యం పెట్టాలి?

అధికారిణి: రైతులు పండించిన వరి ధాన్యం ప్రతీ రైతు ఎకరానికి 32 క్వింటాళ్ల వడ్లు, జొన్నలు 12 క్వింటాళ్లు పెట్టాలని నిబంధన ఉంది.

ఆంధ్రజ్యోతి: వేసవి కాలంలో భూమి దుక్కులు దున్నుకోవచ్చా?

అధికారిణి: వేసవి కాలంలో నల్ల రేగడి భూములు దుక్కులు దున్నుకోవచ్చు. దీనివల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయి. భూమిలో ఉన్న కీటకాలు చనిపోతాయి.

ఆంధ్రజ్యోతి: పశువుల ఎరువులతో పంటలు పండించాలా? ఆరోగ్యంగా ఉంటారా?

అధికారిణి: పశువుల ఎరువులతో పంటలు పండిస్తే పంటలు దిగుబడి పెరుగుతుంది. పండిన ధాన్యం ఆహారంగా సేకరిస్తే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు.

ఆంధ్రజ్యోతి: ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలకు విత్తన శుద్ధి చేయడం వల్ల పంట దిగుబడి పెరుగుతుందా?

అధికారిణి: రైతులు విత్తనాలు విత్తేటప్పుడు విత్తన శుద్ధి చేసుకుని విత్తనాలను విత్తుకోవాలి. దీని వల్ల ఉపయోగాలు విత్తనం మొలకెత్తిన తర్వాత పురుగులు ఆశించవు. అదేవిధంగా మొలకెత్తిన మొక్క బలంగా పెరిగి అధిక దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: ఇటీవల వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఎప్పుడు వస్తుంది?

అధికారిణి: అకాల వర్షాలకు రైతులు కొంత వరకు పక్క నష్టం జరిగింది. నివేదికలు జిల్లా అధికారులకు పంపడం జరిగింది. నిధులు విడుదల అయిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: రైతులు సేంద్రియ ఎరువులు వాడుకుని పంటలు పండించుకోవడం కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తారా?

అధికారిణి: జూన్‌లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు పండించుకుంటే ఉపయోగాలు ఉన్నాయి. అంతేకాకుండా రైతులకు, గ్రామాలకు వెళ్లి అవగాహన సదస్సులు త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

- జుక్కల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి)



సంస్థాగత కమిటీలపై.. కాంగ్రెస్ దృష్టి



- జిల్లాలో స్థానిక ఎన్నికల కంటే ముందే సంస్థాగత బలోపేతంపై కాంగ్రెస్ ఫోకస్
- వచ్చేనెల 20 నాటికి జిల్లా కమిటీలు
- గ్రామస్థాయి నుంచి కమిటీల పునరుద్ధరణ
- ఇప్పటికే ఇద్దరు పరిశీలకుల నియామకం
- వచ్చేనెల 2న విస్తృత స్థాయి సమావేశాలు
- హాజరుకానున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు
- నామినేటెడ్ పదవులపైనా చర్చ

కామారెడ్డి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ సంస్థాగత కమిటీలపై కాంగ్రెస్ దృష్టి సారించింది. స్థానిక ఎన్నికలకంటే ముందే పార్టీని క్షేత్రస్థాయిలో, సంస్థాగతంలో బలోపేతం చేసేందుకు ఫోకస్ పెట్టింది. ఈలోపే సంస్థాగత కమిటీలు పూర్తి చేయాలని పార్టీ భావిస్తోంది. ఈమేరకు వచ్చేనెల 20వ తేదీలోగా జిల్లా కాంగ్రెస్ కమిటీతో పాటు బూత్ స్థాయి, మండల బ్లాక్ స్థాయి కమిటీలను నియమించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీ, ముఖ్యనేతలను కలుపుకొని జిల్లా కమిటీలు వేసేందుకు జిల్లాకు ఇద్దరు చొప్పున టీపీసీసీ అబ్జర్వర్‌లను నియమించింది. ఇందులో ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు కూడా ఉండగా.. ఒక జిల్లాకు చెందిన వారిని మరో జిల్లాకు నియమించారు. మే 20వ తేదీ నాటికి డీసీసీ అధ్యక్షుల నియామకం కావాలన్న రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ సూచన మేరకు పరిశీలకులు పని మొదలు పెట్టారు. ఇప్పటికే కొన్ని జిల్లాలో డీసీసీ సమావేశాలు ప్రారంభం కాగా.. కామారెడ్డి జిల్లాలో మే 2న జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నారు.



ఇద్దరు అబ్జర్వర్‌ల కేటాయింపు

జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ప్రస్తుతం కైలాస్ శ్రీనివాస్‌రావు కొనసాగుతున్నారు. మే 21లోగా బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి నూతన కమిటీలను నియమించాలని టీపీసీసీ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లా కమిటీ అధ్యక్షుడిగా సీనియర్‌లను ఎంపిక చేసేందుకు టీపీసీసీ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాకు ఇద్దరు అబ్జర్వర్‌లుగా సత్యనారాయణ గౌడ్, వేణుగోపాల్ యాదవ్‌లను టీపీసీసీ నియమించింది. అంతేకాకుండా వీరు జిల్లా పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. వీరు జిల్లా స్థాయి విస్తృత సమావేశంతో పాటు మండల, గ్రామ, బూత్ స్థాయి సమావేశాలను నిర్వహించి కమిటీలను నియమించాల్సి ఉంటుంది. వచ్చేనెలా 20వ తేదీ నాటికి ఈ కమిటీల ఎన్నిక పూర్తి చేయాల్సి ఉంటుంది.

మే 2న జిల్లా స్థాయి సమావేశం

రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు జిల్లాలో వచ్చేనెల 2న జిల్లా స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శుభం కన్వెన్షన్‌లో మరో రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తెలిపారు. జిల్లా విస్తృత స్థాయి సమావేశం అనంతరం బ్లాక్ లెవల్, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి సమావేశాలను నిర్వహిస్తారని అన్నారు. ఈ సమావేశాలకు జిల్లా కేటాయించిన అబ్జర్వర్‌లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యేలు మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, సీనియర్ నేత ఏనుగు రవీందర్‌రెడ్డితో పాటు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

నామినేటెడ్ పదవులపై చర్చ

జిల్లాలో ఇప్పటికే నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను కాంగ్రెస్ అధిష్ఠానం సీనియర్ నేతలకు కట్టబెట్టారు. అయితే మరికొన్ని నామినేట్ పదవులు అలాగే ఉన్నాయి. పార్టీకి సంబంధించిన పదవుల కోసం జిల్లా, మండల, గ్రామస్థాయి నేతలు ఎదురుచూస్తున్నారు. వీటితో పాటు ఆలయ, మార్కెట్ కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని త్వరలోనే నియమిస్తుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో పదవులను ఆశించే వారి జాబితా పెరుగుతోంది. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్నవారికి అవకాశం ఇవ్వాలని పలువురు సీనియర్‌లు కోరుతున్నారు. జిల్లాలో పదవులు దక్కాలంటే సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేల ఆశీస్సులు తప్పనిసరి కావడంతో వారిని ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. సంస్థాగత పదవుల కేటాయింపు కోసం సుదీర్ఘంగా పార్టీలో పని చేస్తున్న వారి పేర్లనే జాబితాలో చేర్చాలని, సామాజిక సమీకరణాలను తప్పనిసరిగా పాటించాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించినట్లు సమాచారం.

పార్టీ బలోపేతంపై దృష్టి

జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా అధిష్ఠానం దృష్టి సారిస్తోంది. జిల్లాలో జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించినప్పటికీ.. బాన్సువాడలో బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన స్థానిక ఎమ్మెల్యే ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. అయితే జిల్లా మొత్తంగా పార్టీని పునర్ నిర్మాణం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకోసం కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చర్యలు చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నందున పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్ఠం చేయడానికి అధిష్ఠానం చర్యలు చేపట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతున్నందున నామినేటెడ్ పదవులను భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ మొదలుకొని స్థానిక సంస్థలు, చట్ట సభల ఎన్నికల అభ్యర్థులకు టికెట్ల కేటాయింపులోనూ డీసీసీ అధ్యక్షులను భాగస్వాములను చేసేందుకు అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా బ్లాక్, మండల, జిల్లా అధ్యక్ష పదవులను పకడ్బందీగా భర్తీ చేయనున్నారు. బ్లాక్ అధ్యక్షుడి నియామకానికి ముగ్గురి పేర్లు, మండల అధ్యక్షుడికి ఐదు పేర్లు ప్రతిపాదించాలని పార్టీ అధిష్ఠానం సూచించినట్లు తెలిసింది.



ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

'ప్రజావాణి'కి 95 దరఖాస్తులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే డిస్పోస్ చేయాలని తెలిపారు. ప్రజలు సుదురప్రాంతాల నుంచి వచ్చి తమ ఇబ్బందులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వస్తున్నందున ఆయా శాఖల అధికారులు వెనువెంటనే పరిష్కారం చూపేలా కృషి చేయాలని సూచించారు. ఈ ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో వీణ, ఏవో మసూద్ అహ్మద్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నూతన రేషన్‌కార్డులను ఎలాంటి తప్పులు లేకుండా ఇవ్వాలి

గాంధారి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందజేస్తున్న రేషన్‌కార్డులలో ఎలాంటి తప్పులు లేకుండా ఇవ్వాలని తహసీల్దార్ రేణుకచౌదరికి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సతీష్ వినతిపత్రం అందించారు. సోమవారం ఆయన మండలకేంద్రంలో మాట్లాడుతూ రేషన్‌కార్డుల్లో డిలిట్ చేయించుకున్న వారికి నూతన రేషన్‌కార్డులు దరఖాస్తు చూసుకునే అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. అలాగే, రాష్ట్రంలో పెళ్లి అయిన మహిళలకు వారి భర్త రేషన్ కార్డులో పేర్లు వచ్చే విధంగా చూడాలన్నారు. పిల్లల పేర్లు కూడా వారి యొక్క తండ్రి రేషన్‌కార్డులోనే రావాలని కోరారు.

భూ సమస్యలపై దరఖాస్తు అందజేస్తే..

భూభారతి చట్టం ప్రకారం చర్యలు

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ● నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, బాన్సువాడలో అవగాహన సదస్సులు ● పాల్గొన్న జిల్లా, మండల అధికారులు



నిజాంసాగర్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



అవగాహన సదస్సుకు హాజరైన స్థానిక ప్రజలు

నిజాంసాగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): 14 ఏప్రిల్ 2025 నుంచి మీ సేవా కేంద్రాలలో భూ సమస్యలపై దరఖాస్తు అందజేస్తే భూ భారతి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. భూభారతి చట్టంపై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సోమవారం నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. భూభారతి చట్టం 14 ఏప్రిల్ 2025న ప్రారంభించడం జరిగిందని, చట్టంపై ప్రజలకు, రైతులకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ధరణి స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని పేర్కొన్నారు. 2014జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసిజిలో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీవోలు విచారణ చేసి అర్హత ఉన్న వారి నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. అట్టి వాటిని రికార్డులలో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం ఇస్తారని కలెక్టర్ పలు అంశాలపై వివరించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు మాట్లాడుతూ.. గడిచిన కాలంలో భూమి కోసం పోరాటాలు జరిగాయని, భూముల వివరాలు కాగితాలపై ఒక లెక్క, ఫిజికల్‌గా మరో లెక్క ఉండేదని పేర్కొన్నారు. అందుకే రైతుల సమస్యలు పరిష్కరించడానికి భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతకు ముందు భూ భారతిపై రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్, బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మండల ప్రత్యేక అధికారి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **ముమ్మరంగా అవగాహన సదస్సులు**

మహమ్మద్‌నగర్: భూభారతి చట్టంపై ముమ్మరంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. సోమవారం మహమ్మద్‌నగర్ రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధార్ తరహాలో రైతులకు భూదార్ కార్డులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ చట్టంలో ఏమైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. లింగంపేట మండలంలోని పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ భూభారతిపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సదస్సులో తహసీల్దార్ సవాయిసింగ్, ఎంపీడీవో అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మల్లయ్యగారి ఆకాష్, ఆర్‌ఐ పండరి, సర్వేయర్ శ్రీకాంత్, ఏవోలు, తదితరులు పాల్గొన్నారు.

● **భూ భారతిచట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం**

బాన్సువాడ: భూభారతి చట్టం ద్వారా భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని రెడ్డి సంఘంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్, బాన్సువాడ మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, మండల ప్రత్యేక అధికారి, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



గోర్గల్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ అశీష్ సంగ్వాన్

నిజాంసాగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ అశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం మండలంలోని గోర్గల్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని కొనుగోలు ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోళ్ళు జరిగిన వాటి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, వంటి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు లారీల కొరత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, వ్యవసాయ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

మద్నూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 29వ తేదీన మంగళవారం ఉదయం 10 గంటలకు డోంగ్లి తహసీల్దార్ కార్యాలయంలో, అలాగే మధ్యాహ్నం 2 గంటలకు మద్నూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టం 2025 కల్పిస్తున్న హక్కులపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, డోంగ్లి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సాయిబాబా తెలిపారు. ముఖ్య వక్తలుగా కలెక్టర్ అశిష్ సంగ్వాన్, స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, అదేవిధంగా బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హాజరవుతారని వెల్లడించారు. ఈ సదస్సుకు మండల రైతులు హాజరై భూ భారతి చట్టం గురించి తెలుసుకోవాలని కోరారు.

సహకార సంస్థలు మేలు కలిగిస్తున్నాయి

సదాశివనగర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పనితీరు వల్లనే రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందుతున్నాయని జిల్లా సహకారశాఖ అధికారి రామ్మోహన్ తెలిపారు. సోమవారం చైర్మన్ సదాశివరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సహకార సంఘం రైతుల శ్రేయస్సు కొరకు ఎల్లవేళలా పాటు పడుతుందని సహకార సంఘం అన్ని విభాగాలలో కృషి చేస్తుందని తెలిపారు. ప్రపంచ సహకార సంవత్సరం 2025ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార సంవత్సరంగా గుర్తించిందని తెలిపారు. సహకార రంగాలలో సభ్యులు భాగస్వాములై సంఘ కార్యకలపాలలో పాలు పంచుకోవాలని, సంఘ అభివృద్ధియే ధ్యేయంగా పాటు పడాలని తెలిపారు. చైర్మన్ సదాశివ రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధి చెందుతోందని, రైతులకు సిబ్బంది, పాలకవర్గం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. లో జిల్లా సహకార కార్యాలయ పర్యవేక్షకుడు భూమయ్య ,సీడీసీ చైర్మన్ మహమ్మద్ ఇర్షాదుద్దీన్, మానిటరింగ్ అధికారి సాయిలు, సీఈవో బైరయ్య, సంఘం డైరెక్టర్‌లు నారాయణ రెడ్డి, బత్తుల రాములు, ప్రవీణ్ రెడ్డి, భాస్కర్, ఉమామహేశ్వర్ రావు, సంఘసిబ్బంది లింగమూర్తి, బైరేష్, గంగారాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సహకార శాఖ అధికారి రామ్మోహన్



భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న అధ్యాపకులు

సౌత్ క్యాంపస్‌లో పార్ట్ టైం అధ్యాపకుల నిరసన

● గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేత

భిక్కనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) తమకు ఉద్యోగ భద్రత కల్పించి జీవో నెం.21ని రద్దు చేయాలని కోరుతూ పార్ట్ టైం అధ్యాపకులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో బాగంగా సోమవారం పార్ట్‌టైం అధ్యాపకులు గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు విధ్యార్థుల సంఘీభావం

తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ బీటీఎస్ చౌరస్తాలోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న సమ్మె సోమవారం 10వ రోజుకు చేరుకుంది. కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న సమ్మెకు క్యాంపస్ విద్యార్థులు సంఘీబావం తెలిపి వారి సమ్మెలో కూర్చున్నారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సేవలను గుర్తించి తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు నారాయణ, యాలాద్రి, సునీత, రమాదేవి, సరిత, నర్సయ్య, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

● డీఈవో అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్ కుమార్

కోటగిరి,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): రైడ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌కుమార్ సూచించారు. రుద్రూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో సోమవారం రైడ్స్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 10వ తరగతి విద్యార్థుల కోసం శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. 10వ తరగతిని అభ్యసించే విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రావు, ప్రధానోపాధ్యాయులు దుర్కి సాయన్న, రైడ్స్ అధ్యక్షులు కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పార్వతి శేఖర్, సభ్యులు నర్సింలు, బాలరాజు, మహిపాల్ గుప్తా, మోహన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

నవీపేట బంద్ ప్రశాంతం



నవీపేటలో బంద్ సందర్భంగా మూసి ఉన్న దుకాణాలు

నవీపేట,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల హిందువులపై జరిగిన దాడులను ఖండిస్తూ సోమవారం హిందు ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నవీపేట పట్టణ బంద్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా అన్ని వ్యాపార సంస్థలు, హోటళ్లు, షాపింగ్ మాళ్లను స్వచ్ఛందంగా మూసి ఉంచారు. జమ్మూకాశ్మీర్‌లో హిందువులపై దాడులు జరిపిన దుండగులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నవీపేట ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

తగ్గెల్లిలో అగ్నిప్రమాదం

● ఐదెకరాలలో ఈత చెట్లు దగ్ధం



మంటలకు ఆహుతి అయిన ఈతచెట్లు

బోధన్‌రూరల్,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదెకరాలలో ఈత చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో 2లక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ప్రమాదవశాత్తుగా అకస్మాత్తుగా చెలరేగిన మంటలు ఐదెకరాల ఈత వనాన్ని దగ్ధం చేశాయి. మంటలను అదుపులోకి తేవడానికి అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఈత చెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ సందర్భంగా ఈత కార్మికులు మల్లెపూల లక్ష్మణ్ మాట్లాడుతూ ఏడు తరాలుగా మేము ఈత చెట్లనే ఆధారంగా జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

నేడు జన్నేపల్లి బంద్

నవీపేట,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల హిందువులపై జరిగిన ఉగ్రదాడి ఘటనను నిరసిస్తూ మంగళవారం మండలంలోని జన్నేపల్లి బంద్ చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు వారు వివరించారు.

ముగ్గురు వ్యాపారులకు ఒకరోజు జైలు

బోధన్‌రూరల్,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో రాత్రి సమయంలో నిర్దేశించిన సమయానికి మించి హోటల్, షాపులు తెరిచి ఉంచి నడపడంతో సదరు యాజమానులను సోమవారం కోర్టు ముందు హాజరుపర్చగా న్యాయాధికారి శేషతల్ప సాయి వారికి ఒక రోజు జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. రంగర్‌గల్లీకి చెందిన పవన్ చారి హనుమాన్ మందిరం వద్ద గల తన యొక్క బంగారు షాపును రాత్రి పూట తెరిచి ఉంచినందుకు గాను, శక్కర్‌నగర్‌లో షేక్ యాకుబ్ తన యొక్క మిల్క్ డైయిరీని రాత్రి పూట తెరిచి ఉంచినందుకు ఇద్దరికి ఒకరోజు జైలుశిక్ష, సాత్‌పుల్ చౌరస్తా వద్ద స్ప్రింగ్ బేకరి యాజమాని షేక్ హుస్సేన్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి 10:30గంటల తర్వాత దాబాలు, హోటళ్లు, ఏవైనా వాణిజ్య సంస్థల సముదాయాలు మూసి వేయాలని లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని కొడిచర్ల మంజీర నదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. సోమవారం ఉదయం మంజీర నదిలో ఇసుకను నింపుకుని అక్రమంగా తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వాహన యాజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కల్దుర్కిలో పేకాట రాయుళ్ల అరెస్టు

బోధన్‌రూరల్,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్దుర్కి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 8మందిని అదుపులోకి తీసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6500నగదుతో పాటు 8సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పంట పొలాల్లోని రహస్య స్థావరంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట రాయుళ్లను పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పేకాట ఆడినా, నిర్వహించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పేకాట ఆడి నష్టపోవద్దన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

ఎడపల్లి,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి):మండలంలోనిజానకంపేట గ్రామ శివారులో గల అశోక్ సాగర్ చెరువలో పడి జానకంపేట గ్రామానికి చెందిన బోదసు దేవమ్మ(60) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మామను చంపిన అల్లుడు

● కుమార్తెను బాగా చూసుకోవాలన్నందుకు మామపై ఇటుక రాయితో దాడి
● మృతుడు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి



నిందితుడు రాజేష్ దుర్వేను అరెస్టు చేసిన పోలీసులు

నవీపేట,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): తన కూతురును బాగా చూసుకోమని అల్లుడికి మామ నచ్చజెప్పగా కోపంతో అల్లుడు ఇటుక రాయితో తలపై దాడి చేయడంతో మామ మృతి చెందిన ఘటన మండలంలోని అనంతగిరి శివారులో జరిగింది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వినయ్‌లు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన పలువురు మండలంలోని అనంతగిరి శివారులో నూతనంగా నిర్మిస్తున్న గోదాం వద్ద కూలీ పని చేయడానికి ఇటీవల వచ్చారు. వీరు రెండు నెలల క్రితం జిల్లాలోని భీంగల్‌లో కూలీ పనులు చేయగా 20రోజుల క్రితం అనంతగిరికి వచ్చారు. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కబీర్‌ధామ్ జిల్లా చిరుపాని గ్రామానికి చెందిన బిలయ్ సింగ్ దుర్వే(48)తో పాటు అల్లుడు రాజేష్ దుర్వే మరి కొంతమంది కలిసి కూలీ పని చేయడానికి వచ్చారు. ఇటీవల తరుచుగా రాజేష్ దుర్వే మద్యం సేవించి తన భార్య గోమతి దుర్వేతో గొడవ పడుతుండేవాడు. తన కూతురును శారీరకంగా, మానసికంగా పలుమార్లు వేధించడంతో మామ బిలయ్ సింగ్ దుర్వేకు అల్లుడు రాజేష్ దుర్వేలకు మధ్యన గొడవలు జరిగేవి. ఆదివారం అమావాస్య కావడంతో వారు కూలీ పనికి విరామం ప్రకటించారు. రాత్రి సమయంలో పలువురు మద్యం సేవించారు. అదే రాత్రి సుమారు 10గంటల సమయంలో తన కుమార్తెతో తరుచుగా ఎందుకు గొడవ పడుతున్నావని ఆమెను సరిగా చూసుకోమని బిలయ్ సింగ్ దుర్వే తన అల్లుడు రాజేష్ దుర్వేకు నచ్చజెప్పాడు. దీంతో మామ, అల్లుళ్ల మధ్యన మాటమాట పెరిగి గొడవకు దారి తీసింది. ఇద్దరు పెనుగులాడగా రాజేష్ దుర్వే కోపంతో తన మామ బిలయ్ సింగ్ దుర్వే తలపై ఇటుక రాయితో దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడి కుమారుడు రాజేంద్ర దుర్వే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్ఐలు పేర్కొన్నారు.

● నిందితుడి అరెస్టు

మండలంలోని అనంతగిరి శివారులో ఆదివారం రాత్రి తన మామ బిలయ్ సింగ్ దుర్వేను ఇటుక రాయితో దాడి చేసి చంపి వేసిన అల్లుడు రాజేష్ దుర్వేను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వినయ్‌లు తెలిపారు. తన కుమార్తెను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న అల్లుడికి నచ్చజెప్పబోయిన బిలయ్ సింగ్ దుర్వేను అల్లుడు రాజేష్ దుర్వే ఇటుక రాయితో తలపై పలుమార్లు దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడని వారు పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడు రాజేష్ దుర్వేను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్ఐలు పేర్కొన్నారు.

చలో ఆర్మూర్‌ను విజయవంతం చేయాలి

బాల్కొండ,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నేడు ఆర్మూర్ పట్టణంలో నిర్వహించనున్న చలో ఆర్మూర్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని బాల్కొండ గౌడసంఘం నాయకులు ఒక ప్రకటనలో కోరారు. ఆరు నెలలుగా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గౌడ సోదరులను, మహిళలను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఇబ్బందులకు గురిచేయడం, గ్రామంలో ఈతవనం కాల్చివేయడం, గౌడ సంఘ సభ్యుల హక్కులను అణిచివేయడం లాంటి చర్యలు చేపడుతున్న గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు వ్యతిరేకంగా ఆర్మూర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తార న్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆర్మూర్ మార్కెట్ యాడ్ నుండి గౌడ సంఘ సభ్యులు జేఏసీ నాయకులతో కలిసి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి, ఆర్డీవో, ఏసీపీలకు సమస్యపై ఫిర్యాదు చేస్తారన్నారు. వివిధ మండలాల గౌడసంఘ సభ్యులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కమ్మర్‌పల్లి: గత ఆరు నెలలుగా తాళ్లరాంపూర్ గ్రామాభివృద్ధి కమిటి స్థానిక గౌడ కులస్తులను ఇబ్బందులకు గురిచేస్తు, గ్రాశివారులోని ఈతవనం దహనం చేయడం గౌడకులవృత్తికి తీవ్రమైన ఆటంకాలు కలిగిస్తూ గౌడ కుల సంఘ సభ్యుల హక్కులను కాలరాస్తున్నదని ఐనా ఎవరి పట్టనట్లు వ్యవహరించడం సరైంది కాదని ఈ విషయమై అధికారులు శాశ్వతపరిష్కారం వెతకాలని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌గౌడ కులసంఘం డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయంవద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ రోజు తాళ్లరాంపూర్‌లో జరిగిన సంఘటన రేపు అన్నిగ్రామాలలో ఈ సమస్యతలెత్తే అవకాశం లేకపోలేదన్నారు. ఇలాంటి సమస్యలకు శాశ్వతపరి ష్కారం కోరుతూ.. జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చలో ఆర్మూర్ కార్యక్రమం చేపట్టిందని గౌడకుల బాంధవులుపెద్ద సంఖ్యలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఆర్మూర్ పట్టణంలోని మార్కెట్ యార్డ్‌వద్దకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అక్కడి నుంచి భారీ ర్యాలీ ఉంటుందని అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహేబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసే కార్యక్రమం ఉంటుందన్నారు. కనుక మండలంలోని గౌడకుల సంఘాల సభ్యులు భారీగా తరలి వచ్చి మన ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నాయకులు ఊట్నూర్ రవిగౌడ్, హరీష్ గౌడ్, మధుగౌడ్, సత్యనారాయణ గౌడ్, సదానంద్ గౌడ్, సదాశివ్‌గౌడ్ తదితర గౌడసంఘం సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్లూర్ గౌడసంఘ సభ్యులు

పహల్గాం ఘటనపై కొవ్వొత్తులతో ర్యాలీ



మోర్తాడ్‌లో పార్టీలకు అతీతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు



మెండోరలో కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పహల్గాం తీవ్రవాదుల కాల్పుల్లో అసువులుబాసిన అమరులకు ఆత్మశాంతి చేకురాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా జాతీయ జెండాతో పాటు కొవ్వొత్తులతో ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో తీవ్రవాదాన్ని అంతం చేయాలని,దేశప్రజలందరు ఐక్యమత్యంతో తీవ్రవాదాలను తరిమికొట్టాలని అంటు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమాయక పర్యటకులపై తీవ్రవాదులు చేసిన దాడిని వేల్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మండల పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు నర్సరెడ్డి, నాయకు లు దామోదర్‌గౌడ్, రవి, నరేందర్, మల్లేష్, భగవన్‌దాస్, రేవంత్‌రెడ్డి, చరణ్, రాజేందర్, చిన్నయ్య, స్వ రూప ఇంద్ర గౌడ్, జేమ్స్ గంగారెడ్డి, మోహన్, రహీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్: రెంజల్ మండలంలోని సాటాపూర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ముస్లింలు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పర్యాటకుల అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, వారి కుటుంబాలకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మెండోర: కాశ్మీర్‌లోని పహల్గాంలోని పర్యటకులను కాల్చి చంపడం పట్ల ఉగ్రదాడిని ఖండిస్తు మెండోరలో సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన వారికి నివాలులు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు వేల్పూర్ మార్కెట్ ఛైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సలీం, పట్టణ అధ్యక్షుడు గుండోజీ రవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం పార్టీలకు అతీతంగా భారీ కొవ్వొత్తుల ర్యాలీ గ్రామస్థులు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలక అతీతంగా కాశ్మీర్‌లో జరిగిన హత్యలకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కొవ్వొత్తులతో తిరుగుతూ పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాకిస్తాన్ జెండాను రోడ్డుపై వేసి యువకులు కాళ్లతో తొక్కారు. ఈ కార్యక్ర మంలో గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊర చెరువులో పడి వ్యక్తి మృతి

ఆలూర్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలోని ఊర చెరువులో ఆలూర్ గ్రామానికి చెందిన పుట్ట నవీన్ (41) పడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నవీన్ గత మూడు రోజుల క్రితం నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన కోసం అంతట గాలిం చినప్పటికి ఆచూకి లభించలేదు. సోమవారం ఉదయం చెరువులో అతని మృత దేహం కన్పించింది. నవీన్ గతవారం రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

మాక్లూర్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన పడాల జ్యోతి ఇటీవల అనారోగ్యానికి గురికాగ సోమవారం రూ. 21వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. చెక్కును ఇప్పించినందుకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో తలారి గంగాధర్, రవి, చింతల మోహన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరులో తాగునీటి సమస్య పరిష్కారం

కోటగిరి,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండల కేంద్రంలోని 9వ వార్డులో తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించారు. సోమవారం ఆంధ్రజ్యోతి పత్రికలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మున్నీ నాయక్ స్పందించి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. తాగునీటి పైపులైన్ మరమ్మత్తులు చేపట్టి తాగునీటిని పునరుద్ధరించారు. తాగునీటి కుళాయిలకు మోటారు పెట్టవద్దని సూచించారు. ఆయన వెంట ఏఈ అజయ్, సూపర్‌వైజర్ సునీల్, అఖిల్, నర్సింలు తదితరులున్నారు.

హెగ్డోలిలో కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహ

కోటగిరి,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి):పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద కొనసాగుతున్న అఖండ శివనామ సప్తాహ సోమవారంతో 5వ రోజుకు చేరుకుంది. సప్తాహను పురస్కరించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు, భజనలు, కీర్తనాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. బసవేశ్వర జయంతికి సప్తాహ కార్యక్రమం ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాంబాబు, రాజు, నాగరాజు, రాజేశ్వర్, అర్జున్ పటేల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో రెంజర్ల విద్యార్థి అదృశ్యం

ముప్కాల్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన నల్ల అనురాగ్‌రెడ్డి అదృశ్యమయ్యారు. తప్పిపోయిన తమ కుమారుడి జాడ తెలుసుకుని స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అనురాగ్‌రెడ్డి తల్లి హరిత, కుటుంబ సభ్యులు ఖనిజాభివృద్ధి కార్పోరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు. అనురాగ్‌రెడ్డి విద్యార్థి వీసాపై జనవరిలో లండన్ వెళ్లారు. యూకేలోని కార్డిఫ్ ప్రాంతంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం నుంచి తమ కుమారుడు జాడ తెలియకుండా పోయాడని వారు పేర్కొన్నారు. స్పందించిన ఈరవత్రి అనిల్, సీఎంవో, జీఏడి ఎన్ ఆర్ఐ అధికారులతో మాట్లాడారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డిల్లీలోని విదేశాంగ శాఖకు, లండన్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖలు రాసినట్లు తెలిసింది.

గుర్తుతెలియని వ్యక్తుల మృతి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని ఇద్దరు మగ వ్యక్తులు మృతి చెందినట్లు ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ స్థలంలో కాలు గాయంతో ఉండి ఓ వ్యక్తి ఏప్రిల్ 8న 108 అంబులెన్స్ ద్వారా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకురాగా గత 18 రోజులుగా చికిత్స పొందుతూ ఈనెల 25న మృతి చెందాడని వ్యక్తి మెరూన్ షర్ట్, బ్లూకలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని అతను క్రిస్టోఫర్ సన్ఆఫ్ కన్నన్, నివాసం హైదరాబాద్‌గా తెలిపాడని ఇతనికి సంబంధించిన సమాచారం తెలిసినచో ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712659714 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

● నగరంలోని తిలక్‌గార్డెన్ వద్ద గ్లామర్ హోటల్ ముందు ఓ గుర్తుతెలియని వ్యక్తి డివైడర్ పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండగా 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని చనిపోయిన వ్యక్తి బ్లూకలర్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని అతని గురించి ఏవైనా సమాచారం తెలిస్తే ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712659714 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిజామాబాద్ ఏసీపీకి రూరల్ ఎమ్మెల్యే పరామర్శ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మాతృవియోగం పొందిన నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డిని సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నిర్మల్‌లోని ఆయన స్వగ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ తల్లి రాజమణి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ముప్ప గంగారెడ్డి,మునిపల్లి సాయరెడ్డి,భూమ్‌రెడ్డి, బాగారెడ్డి, ఉన్నారు.

వర్షాలు కురిసిన తరువాతే పసుపు విత్తనాలు నాటుకోవాలి



కమ్మర్‌పల్లి పసుపు వంగడాలను పంపిణీచేస్తున్న సుంకెట బుచ్చన్న

కమ్మర్‌పల్లి,ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):జూన్ నెలలో వర్షాలు కురిసిన తరువాతే పసుపు విత్తనాలు నాటుకోవాలని ముందస్తుగా నాటితే మాడిపోయే అవకాశాలు ఉంటాయని కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మహేందర్ అన్నారు. సోమవారం పసుపు పరిశోదన కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన రైతులకు వివిధ రకాల పసుపు వంగడాలను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సుంకెట బుచ్చన్న చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతుపసుపు విత్తనశుద్ధి తప్పనిసరి చేయాలని అలా చేస్తే చీడపీడలు బారినుంచి పంట రక్షణ అవుతుందని రైతుకు అధికదిగుబడి వస్తుందన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్ నిర్మల్ తదితర జిల్లాల రైతులతో పాటు స్థానిక రైతులు 50 మంది రైతులకు సుమారు నుంచి 50 క్వింటాల్ల మేర దుగ్గిరాల పసుపు, రాజేంద్రసోనియా, బీఎస్ఆర్-2,రాజాపురి, పులేస్వరూప తదితర వివిధ రకాల పసుపు వంగడాలను పంపిణీ చేసినట్లు శాస్త్రవేత్త మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి, స్థానిక రైతులతో పాటు వివిధ జిల్లాలకు చెందిన రైతులు, మహిళ రైతులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జ్‌లతో నిరసన తెలిపారు. ఛత్తీస్‌ఘడ్, తెలంగాణ రాష్ట్ర సరిహద్దులలో కర్రెగుట్టలో యుద్ధక్షేత్రాన్ని మరిపిస్తుందని సరిహద్దు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఆదివాసి గిరిజనులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ సబ్‌డివిజన్ కార్యదర్శి శివాజీ, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, వర్ణారెడ్డి, అలీం, హుస్సైన్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఛత్తీస్‌ఘడ్-తెలంగాణ రాష్ట్రసరిహద్దుల్లో గల కర్రెగుట్ట ప్రాం తంలో గత 5రోజులుగా యుద్ధక్షేత్రం తలపిస్తున్న కారణంగా ఆ నరమేధాన్ని సాయుధ బలగాలను వెంటనే ప్రభుత్వం వెనిక్కి రప్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ డివిజన్ కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. సోమవారం డిచ్‌పల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ ఛత్తీస్‌ఘడ్ ప్రాంతంలో నివాసముంటున్న ఆదివాసీ గిరిజనులు తమ ప్రాణాలు అరిచేతుల పెట్టుకొని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారని ఇప్పటికి హెలీక్యాప్టర్, డ్రోన్స్, సాయిధ బలగాలు ఆ ప్రాంతంలో తిష్టవేయగా ప్రతీ రోజు ఎన్‌కౌంటర్‌లు జరుగుతున్నాయని 3రోజులుగా కాల్పులు జరుపుతున్న కారణంగా మావోలు ఆదివాసీలు 80మంది హతమైనట్లు వార్తలు వస్తున్నాయని అడవులు బాంబుల మోతాలతో దద్దరిల్లుతున్నయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సాయాగౌడ్, మండల కార్యదర్శి మురళి, టీయూసీఐ నాయకుడు కిషన్, పీవోడబ్లూ నాయకురాలు సంధ్య, నాయకులు నారాయణ, మోహన్ పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం

ఆలూర్, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలంలోని సమీక్ష సమావేశం జరిగింది. ఆలూర్ మండలాధ్యక్షుడు శ్రీ సుర శ్రీకాంత్ అధ్యక్షతన మండల పూర్తిస్థాయి కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రబారీ మారంపల్లి గంగాధర్ మాట్లాడుతూ మండల కమిటీకి ఎన్నిక కాబోతున్న నాయకులు పార్టీ సంస్థాగత నిర్మాణంలో క్రియాశీలకంగా పనిచేయాలని, రానున్న రోజుల్లో పార్టీకి పునరంకితమై పనిచేస్తే కార్యకర్తలకు కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు సుభాష్, నాడీశరం మల్లయ్య, అరుణ్, సురేష్, యాదవ్, డి. మల్లేష్, రమేష్, రాజేంద్, హరీష్, అశోక్, అఖిలేష్, చరణ్, భూషన్, సతీష్, వినోద్, శివలింగన్న, పోశెట్టి , ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 404 పశువులకు, 112 ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి హర్షిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గోపాల మిత్ర, రైతులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో కరపత్రాల ఆవిష్కరణ

భీమ్‌గల్,ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మే 12న మెట్‌పల్లిలోని నవయాన బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే బుద్ధ పూర్ణిమ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండల బుద్దిస్ట్ నాయకులు కరపత్రాలు సోమవారం పట్టణ కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద ఆవిష్కరిం చారు. 2587వ బుద్ధ పూర్ణిమ మహోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి బడుగు బలహీన వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరు అవుతున్నాట్లు వారు తెలిపారు. భీమ్‌గల్ మండల నాయకులు బట్టు అనిల్, భీమ రవీందర్, మేకల శ్రీనివాస్, చింతలూరు అవినాష్, బట్టు సునీల్, బద్దం అవినాష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కొండూర్‌లో గ్రామస్తుల ధర్నా

● రెండు గంటల పాటు గంగమట్టి వాహనాల నిలిపివేత

నందిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడమ్మ కొండూర్‌లో సోమవారం గ్రామస్తులు ధర్నా చేశారు. సుమారు రెండు గంటలకు పైగా మట్టి వాహనాలను నిలిపేశారు. వాహనాల అతివేగాన్ని, అధిక లోడ్డును నివారించాలని డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా లోకేశ్వర్ మండలం పంచగుడి శివారులో నల్లమట్టిని పలువురు ఇతర గ్రామాలకు మండలాలకు తరలిస్తున్నారు. గోదావరి నది నుంచి చౌడమ్మ కొండూర్ మీదుగా నందిపేట వైపు అధిక లోడ్‌తో, అతివేగంగా వస్తున్న వాహనాలు సోమవారం ఒక బైక్‌ను ఢీకొనగా అతనికి తీవ్ర గాయాలైనాయి. అంతే కాకుండా గ్రామానికి చెందిన రైతు గేదేను ఢీకొట్టారు.దీనికి కోపోద్రేకులైనగ్రామస్తులు ధర్నా చేట్టారు.వాహన యజమానులు, డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ధర్నావివరాలను తెలుసుకున్న పోలీసులు సర్దిచెప్పిధర్నాను విరమింపజేశారు.

తడగామ కాలనీలో నీటి సరఫరాకు అధికారుల చర్యలు



మరమ్మత్తులను పరిశీలిస్తున్న ఎంపీవో

నవీపేట,ఏప్రిల్28(ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తడగామ కాలనీలో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు సోమవారం అధికారులు చర్యలు చేపట్టారు. గత వారం రోజులుగా కాలనీలో నీటి సరఫరా సక్రమంగా జరగకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. దీంతో కాలనీవాసులు కాలనీలో నెలకొన్న నీటి సమస్యలపై మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌లు తడగామ కాలనీకి నీటి సరఫరా అందించే ప్రధాన ట్యాంకల వాల్వులకు మరమ్మత్తులు చేయించారు. అలాగే పైపులైన్‌లో పేరుకపోయిన ఇసుక, మట్టిని ఎయిర్ పంప్‌తో తొలగించి నీటి సరఫరా చేపట్టారు.

ఎల్లారెడ్డిలో గల్లికో మద్యం దుకాణం

● 60కి పైగా బెల్టు షాప్‌లు
● బెల్టు షాపుల్లో వైన్స్‌ల పేరుతో స్కానర్ల ఏర్పాటు
● విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
● చోద్యం చూస్తున్న ఎక్సైజ్, పోలీసు అధికారులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలలో బెల్టు షాపులలో దందా జోరుగా సాగుతోంది. సుమారు 60కి పైగా దుకాణాలు 24 గంటలు నడుస్తున్నాయి. రాత్రి పగలానే తేడా లేకుండా ఎప్పుడైనా మందు రెడీ అనే స్థాయిలో వ్యాపారం జరుగుతోంది. దీంతో కూలీ నాలి చేసుకునే పేద మధ్య తరగతి బతుకులు కూలిపోతున్నాయి. రోజంతా చెమటోడ్చి సంపాదించింది అంతా బెల్టు షాపుల్లో కరిగిపోతుంది. మద్యం షాపులు, బార్ షాపుల యజమానులే స్వయంగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసి మరీ దందా కొనసాగిస్తున్నారు. ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ మామూళ్ళ మత్తులో పడి పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

● 24 గంటలు అందుబాటులో మందు

ఎల్లారెడ్డిలో ఉన్న మద్యం షాపుల కనుసన్నాలలోనే ఇక్కడి బెల్టు షాపుల దందా కొనసాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అమ్మకాలు పెంచుకునేందుకు వారే ఇక్కడ బ్రాంచ్ ఏర్పాటు చేసి మరీ బెల్టు దందాను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో షాపు యజమాని ఇక్కడ పది బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇక్కడి బెల్టు షాపుల్లో కొంత మంది సొంతంగా నిర్వహించుకుంటే మరికొన్నింటినీ కమీషన్ పద్దతిలో మద్యం బార్ షాపుల యజమానులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది.

● చోద్యంచూస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి డివిజన్‌లో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ బెల్టు షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఇక్కడి ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక లా అండ్ ఆర్డర్ పోలీసులలో కొంతమంది కానిస్టేబుళ్లు ఇక్కడి బెల్టు షాపుల నుంచి నెల వారి మామూలు తీసుకుంటూ వారికి సహకరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అబ్కారీ అధికారులు, స్థానిక పోలీసులు బెల్టు దందాను కట్టడి చేయాలని స్థానిక ప్రజలు ముఖ్యంగా మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

● బెల్టు షాపుల్లో సైతం వైన్స్ పేరుతో ఉన్నస్కానర్లు

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో కొన్ని బెల్టు షాపుల్లో స్థానికంగా ఉన్న వైన్స్‌ల పేరుతో స్కానర్లు సైతం ఏర్పాటు చేశారు. మందుబాబులు మద్యం కోసం బెల్టు షాపులకు వెళితే వైన్స్ పేరుతో ఉన్న స్కానర్లు ఏర్పాటు చేసి మరి నేరుగా వైన్స్ యజమాని ఖాతాలో జమ అయ్యేవిధంగా దందా కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహించడమే కాకుండా దర్జాగా వైన్స్‌ల పేరుతో ఉన్న స్కానర్లు పెట్టి అమాయకులను ఆగం చేస్తున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సిద్దుల గుట్టపై చిరుతపులి సంచారం


సిద్దుల గుట్ట రాతిపై కూర్చున్న చిరుత

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్‌లోని ప్రసిద్ద నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం చిరుత పులి సంచరించడం కలకలం రేపింది. చిల్డ్రన్‌పార్కు పక్కన గోశాల సమీపంలోని మూల మలుపు వద్ద రాళ్లల్లో సంచరిస్తున్న చిరుతపులి స్థానిక యువకులకు కన్పించింది. ముగ్గురు యువకులు సాయంత్రం సమయంలో సిద్దుల గుట్టపైకి వెళ్లి వస్తుండగా రాళ్లమధ్య నుంచి చూస్తుండడాన్ని యువకులు గమనించారు. వెంటనే రాళ్ల మధ్యలో నుంచి లోనికి వెళ్లిపోయింది. గుత్ప, చిన్నాపూర్ అడవి ప్రాంతం నుంచి సిద్దుల గుట్టపైకి వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఇక్కడ గోశాలలో ఆవులు ఉన్నాయి. సిద్దుల గుట్టపై చిరుతపులి సంచరిస్తుందని తెలిసి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

సభను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

● జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతమైందని జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. నిజామాబాద్‌లో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు చూసి ఎక్కువ మంది సభకు తరలివచ్చారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందన్నారు. సమావేశానికి తరలివచ్చిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నేత ఎనగందుల మురళి, కరిపె రాజు, మీసాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన


దేమికలాన్ గ్రామంలో పేరుకుపోయిన చెత్తాచెదారం


సంగోజివాడి గ్రామంలో అధికారులు పట్టించుకోక నిరుపయోగంగా మారిన డంపింగ్ యార్డు


కరడ్‌పల్లి గ్రామంలో నీరు ఉండి నిరుపయోగంగా ఉన్న బోరు

ప్రత్యేక పాలనలో కుంటుపడుతున్న గ్రామాల అభివృద్ధి

● గ్రామాల్లో కనిపించని పారిశుధ్యం ● పెరుగుతున్న తీవ్ర నీటి ఎద్దడి ● పంచాయతీల్లో పైసలు లేక అభివృద్ధి శూన్యం ● రోజురోజుకు పెరుగుతున్న పంచాయతీల లొల్లి

తాడ్వాయి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా ఉంది. గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టడంలో ప్రత్యేక అధికారులు విఫలమవుతున్నారు. గ్రామాల్లోని డంపింగ్ యార్డులో ఇక్కడి ఎక్కడ చెత్త చెదారం పేరుక పోతుంది. పల్లె ప్రకృతి వనాలను పట్టించుకునే నాథుడే లేడు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ గ్రామాల్లో నివారణ చర్యలు చేపట్టడం లేదని పలువురు అంటున్నారు. అసలే ఎండా కాలం గ్రామాల్లో ఉన్న బోరు బావులు ఎండిపోతున్నాయి. గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంటుంది. మిషన్ భగీరథ నీళ్లు కూడా సరిగా రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. దీనితో గ్రామాల్లోని ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతుంది. కలెక్టర్ నీటి ఎద్దడి తీవ్రత లేకుండా చూడాలని ప్రత్యేక అధికారులకు ఆదేశించినా ఫలితం మాత్రం శూన్యంగా కనిపిస్తుంది. కొన్ని గ్రామాల్లో నైతే మూడు నాలుగు రోజులకు ఒకసారి నీరు వస్తుందని పలువురు మహిళలు అంటున్నారు. ఇలానే ఉంటే రాబోవు రోజుల్లో చాలా ఇబ్బంది ఏర్పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక పాలనలో గ్రామ పంచాయితీలో పైసలు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదని అధికారులు అంటున్నారు. నీటి ఎద్దడి నివారణ తీర్చేందుకు ట్యాంకర్లను పెడితే వాటి నిర్వహణ ఖర్చు తడిసి మోపెడవుతుందని కార్యదర్శులు అంటు న్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్ లైన్ల లీకేజీ ఖర్చు కూడా ఎక్కువ అవు తుందని వారు అంటున్నారు. గ్రామాల్లో సరిగ్గా మిషన్ భగీరథ నీరు రావడం లేదని అధికారులను అడిగితే పైపులైన్ సరిగా లేక పోవడం వలన నీరు రావడం లేదని దాట వేస్తున్నారు. ఏ పని చేసిన అప్పులు తెచ్చి పెట్టడమే అవుతుందని వాపోతున్నారు. పలు గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న దృశ్య అధికారులు స్పందించి గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గ్రామాల్లో సర్పంచి పాలన లేక రోజు రోజుకు భూ తగాదాలు గెట్టు పంచాయతీలు ఎక్కువ అవుతున్నాయి. గ్రామాల్లో ఎవరికి వారే యమునా తీరే అన్నే విధంగా కనిపిస్తుంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి త్వరలో సర్పంచి ఎన్నికలు జరిపేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఏదైతేనేం మొత్తం మీద ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని స్పష్టంగా కనిపిస్తుంది. ఇక కొన్ని రోజులు అయితే కాంగ్రెస్ పాలన రెండేళ్ల పూర్తి చేసుకుంటుంది. అయినా పంచాయతీ ఎన్నికలు ఇప్పటి వరకు జరగడం లేదని అంటు న్నారు. ఇలానే ఉంటే గ్రామాలు అభివృద్ధి మరింత కుంటుపడే విధంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధి నిర్వహణ భారమవుతుందని పలువురు అధికారులు వాపోతున్నారు. గ్రామాల్లో సర్పంచ్ ఎలక్షన్లు ఎప్పుడు నిర్వహిస్తారో వేసి చూడాల్సిందే.

● నీరు రాక ఇబ్బందులు పడుతున్నాం

కరడ్‌పల్లి గ్రామంలోని మూడు కాలనీలలో నీరు రాక ఇబ్బంది పడుతున్నాం. ఏ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. అధికారులు మా నీటి గోస తీర్చాలని వేడుకుంటున్నాం.

- గొల్ల సవిత, గృహిణి


వరి కొయ్యలకు నిప్పుపెట్టిన దృశ్యం


రోడ్డుపక్కన చెట్లకు నిప్పు అంటుకున్న దృశ్యం

వరి కొయ్యలు కాల్చొద్దు!

● భూసారం తగ్గుతుందని అధికారుల హెచ్చరిక
● భూమిలోనే కలియదున్నాలని సూచన

డొంకేశ్వర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రస్తుతం వరికోతలు ముగింపు దశకు చేరుకున్నాయి. వరి కొయ్యలు కాల్చి వానాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గడంతో పాటు కాల్చే సమ యంలో జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదాలు జరుగుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. వరి కొయ్యలు కాలుస్తుండగా వేడిగాలికి మంటలు వ్యాపించి సమీపంలో ఉన్న చెట్లు, పంటలు, మోటర్ వైర్లు కాలిపోయే ప్రమాదం ఉంది. పొలాలకు దగ్గరగా ఉన్న పలు పంటలు కూడా కాలిపోయే పరిస్థితి ఉంటుంది. రైతుల పొలంలోని వరి కొయ్యలను కాల్చే సమయాలలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అయితే రోటోవేటర్ సహాయంతో వరికొయ్యాల్ని భూమిలోనే కలియదున్నితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. కొయ్యకుళ్లి సేంద్రియ ఎరువుగా మారుతుంది. పొటాషియం నత్రజని భాస్వరం మొక్కలకు అందుతుంది. దున్నటానికి ముందు మార్కెట్లో దొరికే సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే త్వరగా కొయ్య మురిగి భూమిలో కలిసిపోతుంది. అనంతరం 20 రోజుల తర్వాత నాటువేస్తే రాసాయన ఎరువులను ఎక్కువగా వాడాల్సిన అవసరం ఉండదు.

భూసారానికి ముప్పు..

యాసంగిలో మండల వ్యాప్తంగా సుమారు 9వేల ఎకరాల్లో రైతులు వరిపంట సాగు చేశారు. ఇప్పటికే దాదాపుగా అన్ని ప్రాంతాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. వరి కోతలు అనంతరం కొయ్యకాలను కాల్చే సమయంలో రైతులు ఏమాత్రం ఆద మర్చిన పెను ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. కూలీల కొరత కారణంగా చాలా గ్రామాల్లో రైతులు వరికోత యంత్రాల హార్వేస్టర్‌తో పంటలను కోస్తారు. కోతలు పూర్తయిన తర్వాత వ్యవసాయ భూముల్లో మిగిలిపోయిన కొయ్యకాలను కాలుస్తుంటారు. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కొందరు రైతులు నిర్లక్ష్య ధోరణితో కొయ్యలకు నిప్పు పెట్టడం వల్ల కేబుల్ వైర్లు, చెట్లకు నష్టం జరుగుతుంది. వరికోతలకు యంత్రాలు లేనప్పుడు రైతులు కూలీలను పెట్టి కొడవలతో పంట కోతలు చేపట్టేవారు. కల్లాలు ఏర్పాటు చేసుకొని దాన్యాన్ని నూర్పిడి చేసేవారు. ఈ పద్దతిలో వరి దంటును పూర్తిగా కిందకు కోసేవారు. అలా మిగిలిపోయిన కొయ్యలను కలియదున్ని మళ్లీ పంటను సాగు చేసేవారు. దీంతో కొయ్యలు కుళ్ళిపోయి ఎరువుగా మారి భూసారం పెంచేందుకు దోహదపడేది. కానీ కొన్నేళుగా వరికోత యంత్రాలు అందుబాటులోకి రావడంతో వాటితోనే కోతలు చేపడుతున్నారు. వరి కొయ్యలను పైపైకి కొయ్యడంతో కొయ్యలు మిగులుతున్నాయి. వాటికి నిప్పటించి కాల్చి వేయడంతో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, కీటకాలు మృతి చెందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో భూసారానికి నష్టం కలిగే అవకాశా లు ఎక్కువగా ఉన్నాయి.

వరి కొయ్యలను పొలంలోనే కలియ దున్నాలి..

● మధుసూదన్, మండల వ్యవసాయాధికారి, డొంకేశ్వర్



వానకాలం సీజన్‌కు సన్నద్ధం అవుతున్న రైతులు యాసంగిలో వరి పంటను కోయగా మిగిలిన కొయ్యలను కాల్చి వేస్తున్నారు. పొలంలోనే కలియదున్నితే లాభమని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వరి కొయ్యలను కాల్చితే పంట దిగుబడితో పాటు భూసారం తగ్గుతుంది. వరి కొయ్యలకు నీరు పెట్టి పొలంలోనే కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూసారం పెరగడానికి దోహదం చేస్తుంది. రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరేం!

● రోడ్లు భవనాల శాఖ అధికారుల తీరుపై ప్రయాణికుల అసహనం


ప్రమాదాలకు అడ్డాగా మారిన కల్వర్టు కోసం తవ్విన గుంత

సిరికొండ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) కల్వర్టు నిర్మాణం కోసం తవ్వించిన గుంత నిత్యం ప్రమాదాలకు అడ్డాగా మారినా రోడ్లు భవనాల శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సిరికొండ నుంచి వేములవాడ వెళ్లే రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే అంతర్ జిల్లా రహదారిపై తెల్లవలుగు వద్ద పైపు కల్వర్టు నిర్మాణానికి కాలువ తవ్వించి మరిచిపోయారని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ రోడ్డును 2018 శాసన సభ ఎన్నికల ముందు వెడల్పు చేయించిన భవనాల శాఖ అధికారులు కల్వర్టును నిర్మించక పోవడం ప్రమాదాలకు కారణమవుతుంది. పలువురు ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడి గాయాల పాలయ్యారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రజలు, భక్తులు వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకోవడానికి ఈ రోడ్డు మార్గంలో వెళ్తుంటారు. సిరిసిల్లాకు, నిజామాబాద్ జిల్లా ప్రజల మధ్య బంధుత్వాలు, ఉండడంతో పాటు సిరిసిల్లా వస్త్ర పరిశ్రమకు వెళ్లి వ్యాపారస్తులు బట్టలు తీసుకొచ్చి ఇక్కడ విక్ర యించుకుం టారు. అట్లాంటి రోడ్డుపై కల్వర్టును నిర్మించకుండా వదిలి పెట్టడం ఇబ్బంది కరంగా మారిందని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఇటీవల పందిమడుగు గ్రామానికి చెందిన జలందర్ అనే యువకుడు ద్విచక్ర వాహనం వస్తు కల్వర్టు కోసం తవ్విన కాలు వలో పడిపోయాడు. చేతు ఎముక పగుళ్లు ఏర్పడ్డాయని పందిమడుగు గ్రామానికి చెందిన యువకులు చెప్పారు. కల్వర్టు కోసం తవ్విన గుంత వద్ద ప్రాణాలు పోక ముందే అధికారులు తేరుకుని కల్వర్టును నిర్మించ డానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదలను పంపించాం: ఆర్‌అండ్‌బీ అధికారులు

ఇక్కడ పాతది కల్వర్టు ఉండేదని దాని బదులుగా నూతన కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాము. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టీయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు


సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులరైజ్ చేయాలని విధులు బహిష్కరించి గత పది రోజులుగా సమ్మె చేస్తున్న తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసిన సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అధ్యాపకుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని కాంట్రాక్టు అధ్యాపకులు పేర్కొన్నారు.

జొన్న రైతులకు గన్నీ బ్యాగుల కొరత

● గన్నీ బ్యాగుల కోసం తరలివచ్చిన రైతన్నలు ● రైతన్నను వెంటాడుతున్న అకాల వర్ష భయం ● తొందరగా తూకాలు వేయాలంటున్నరైతులు



కొనుగోలు కేంద్రంలో నిలువ ఉంచిన జొన్నలు


సహకార సంఘానికి చేరుకున్న గన్నీ బ్యాగుల లారీ


చిరిగిన గన్నీ బ్యాగులు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ సారి భారీ వర్షాలు కురియకపోవడంతో రబీ సీజన్‌లో ఆయా గ్రామాలలో రైతన్నలు సాగు నీటి భయంతో వరిని కాకుండ జొన్న పంటను సాగు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మెజారిటీ రైతన్నలు జొన్న పంటను సాగు చేయడంతో ప్రస్తుతం ఆ పంట చేతికివచ్చింది. దీంతో రైతులు పంటను అమ్ముకునేందుకు సహకార సంఘానికి తీసుకవస్తున్నారు. వరి ధాన్యం మాదిరిగానే జొన్న పంటను కూడ ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతన్నలు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సహకార సంఘాల ఆధ్వర్యంలో జొన్న పంట కొనేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం పరిధిలో అధికారులు జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు. అయితే జొన్న కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగుల కొరత ఉండటం రైతన్నలను కలవరపెడుతుంది. దీనికి తోడు గత మూడు, నాలుగు రోజుల నుండి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం, అకాల వర్షాల భయంతో రైతన్నలు తమ పంట ఏమౌతుందోనని ఆందోళన చెందుతున్నాడు.

గన్నీ బ్యాగులు వచ్చినవి గోరంత.. కావాల్సింది కొండంత

వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం మండలంలో ఆయా గ్రామాల్లో సుమారుగా 12 వేల ఎకరాలలో జొన్న పంటను సాగు చేశారు. ప్రస్తుతం జొన్న పంట చేతికి రావడంతో రైతన్నలు పంట నూర్పిడి చేయగా వ్యవసాయ శాఖ అధికారుల అంచనా ప్రకారం ఎకరాకు సుమారుగా 22 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు సమాచారం. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ఎకరాకు 14 క్వింటాళ్ల జొన్నలకు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. దీంతో సుమారుగా 3 లక్షల 36 వేల గన్నీ బస్తాల అవసరం ఉంది. అయితే ఇప్పటి వరకు పెద్ద కొడప్‌గల్ సహకార సంఘానికి కేవలం 50 వేల బస్తాలు మాత్రమే వచ్చాయి. దీంతో గన్నీ బస్తాల కోసం వివిధ గ్రామాల నుంచి రైతన్నలు సహకార సంఘానికి భారీగా తరలి వచ్చారు. అయితే ఆదివారం వచ్చిన గన్నీ బస్తాలతో వచ్చిన లారీలో పనికి రాని బస్తాలు చాలా వచ్చాయి. వీటిలో జొన్నలను తూకం వేయడానికి కూడా పనికిరాకుండా ఉన్నాయి.

రైతన్నలను వెంటాడుతున్న అకాల వర్షభయం

గతంలో జొన్న కొనుగోలు కేంద్రాలలో అధికారులు వరిధాన్యం కొనుగోలు పూర్తయిన తర్వాత జొన్న కొనుగోలు చేసేవారు. అయితే ఈ సంవత్సరం రబీ పంట కింద వరి కంటే అధికంగా జొన్న పంటను రైతన్నలు సాగు చేశారు. వరి ధాన్యం తక్కువగా ఉండటం జొన్న పంట ఎక్కువ దిగుబడి రావడంతో జొన్నరైతులు తూకాలు తొందరగా వేయాలని అధికారులను వేడుకుంటున్నారు. గత మూడు, నాలుగు రోజుల నుండి వాతావరణంలో మార్పులు కారణంగా ఆకాశం మేఘావృతం కావడంతో అకాల వర్షాలు కురిస్తే పంట నాశనం అవుతుందని రైతన్నలు బెంగ పడుతున్నారు. కొద్ది రోజుల కిందట పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంతో పాటు బిచ్కుంద, జుక్కల్ మండలాల్లో అకాల వర్షం కురిసింది. దీంతో జొన్న పంటను తొందరగా తూకం వేయాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు. వర్షాలు కురియకపోతే ఇంక కొన్ని రోజుల పాటు ఆగేవారమని, వర్షం కురిస్తే జొన్న పంట నాశనం అవుతుందని వాపోతున్నారు.

గన్నీ బ్యాగుల కోసం తరలివచ్చిన రైతన్నలు

జొన్న కొనుగోలు తొందరగా పూర్తి చేసుకోవాలనే ఆత్రుతతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతన్నలు ఆదివారం సహకార సంఘానికి తరలివచ్చారు. గతంలో 20 వేల గన్నీ బ్యాగులు రాగా సహకార సంఘం సిబ్బంది వాటిని వివిధ గ్రామాలలోని రైతులకు అందజేశారు. ఆదివారం మరో 30 వేల గన్నీ బస్తాలు రాగా వాటి కోసం రైతన్నలు భారీగా తరలివచ్చారు. దీంతో సహకార సంఘ సిబ్బంది వాటిని ఆయా గ్రామాల రైతులకు అందజేశారు. ఇంకా మిగిలిన రైతులకు కూడ సరిపోయేన్ని గన్నీ బ్యాగులు అందజేయాలని జొన్న రైతులు కోరుతున్నారు.

గన్నీ బ్యాగుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాం

భీం, రైతు, సముందర్ తండా



నేను నాకున్న 5 ఎకరాల పొలంలో జొన్న పంటను సాగు చేశాను. ప్రస్తుతం పంట చేతికి రాగా 5 ఎకరాలకు సుమారుగా 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంటను కొనుగోలు కేంద్రంలో అమ్ముదామంటే గన్నీ బ్యాగుల కొరత ఉంది. ప్రస్తుతం అకాల వర్ష భయం వెంటాడుతుంది. అధికారులు తొందరగా గన్నీ బ్యాగులు సరిపోయేంత అందించాలని కోరుతున్నాం.

గన్నీ బ్యాగులు సరిపోయేన్ని అందించాలి

ప్రతాప్‌సింగ్, సర్దార్ తండా



నేను నాకున్న 25 ఎక రాల పొలంలో జొన్న పంట సాగు చేశా. సుమారుగా 3 వందల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రం ద్వారా మా తండాకు 6 వందల గన్నీ బ్యాగులు అందించారు. అవి సరిపోయేంతగా లేవు. జొన్న కొనుగోలుకు సరి పోయేంత గన్నీ బ్యాగులు అందించాలని కోరుతున్నాం.


సమీక్షా సమావేశంలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే

ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయండి : ఎమ్మెల్యే తోట

జుక్కల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారుల ఆదేశించారు. సోమవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారిని గుర్తించి వారికి అధికారులు ఇండ్ల నమూనాకు మార్కౌట్ ఇచ్చి పనులు చేయించాలని ఆయన ఆదేశించారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి బిల్లులు సకాలంలో అందజేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నిరుపేదలు ఇందిరమ్మ ఇల్లు కట్టుకొని అభివృద్ధి చెందాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగంపేటకు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి రాక

లింగంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్పల్లిలో మంగళవారం జరిగే భూ భారతి రెవెన్యూ గ్రామ సభలో పాల్గొనేందుకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌లు వస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది తెలిపారు. రాష్ట్రంలో భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా లింగంపేట మండలాన్ని ఎంపిక చేసుకోవడం జరిగింది. మంత్రి భూ భారతిపై రైతులకు వివరించనున్నారని, ప్రభుత్వం పేదలకు చేస్తున్న సంక్షేమ పథకాలను గురించి తెలియజేస్తారని వారు తెలిపారు.

పాండురంగ విఠలేశ్వర స్వామిని దర్శించుకున్న పోచారం

బాన్సువాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పండరీపూర్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రుక్మిణీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయానికి వెళ్లి స్వామి వారిని సోమవారం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ప్రజా ప్రతినిధులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోచారానికి ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికి శాలువాతో సన్మానం చేశారు. మరాఠీ సంప్రదాయంలో పండరిపూర్ విఠలేశ్వరుని భజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట ఆలయ కమిటి సభ్యులు, బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

30న బాల్య వివాహాల నిరోధానికి ప్రచార కార్యక్రమం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా బాల్య వివాహాల నిరోధానికి దేశవ్యాప్తంగా జస్టిఫర్ రైట్ అసెస్ టూ జస్టిస్ సంస్థ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతుందని జస్ట్ ఫర్ రైట్ సాధన సంస్థ కోఆర్డినేటర్ గిరిజా తెలిపారు. ఈనెల 30న గ్రామాలలో, మండల కేంద్రాలలో ఉన్న దేవాలయాలు,చర్చిలు, మసీదులు, గురుద్వారాలు ఎంపిక చేసుకుని మత పెద్దలను ఈ అంశాల పట్ల సహకరించమని కోరుతామని తెలిపారు. ప్రచార కార్యక్రమ ముఖ్యఉద్దేశం వివాహాల కార్యక్రమంలో ప్రధానభూమిక నిర్వహించే మత పెద్దలు పురోహితులు బాల్య వివాహాలు నిరోధించేందుకు సహకరించి ప్రజల్లో చైతన్యం కలిగిస్తారని తెలిపారు.


క్యాన్సర్ సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

భిక్కనూరులో క్యాన్సర్ సర్వే ప్రారంభం

భిక్కనూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి) భిక్కనూరు మండలంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు సోమవారం క్యాన్సర్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని వైద్యాధికారి యేమిమా అన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామంలో క్యాన్సర్ సర్వే కార్యక్రమాన్ని ప్రతీ ఇంటిఇంటికి వెళ్లి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో వెంకటరమణ, ఆశాలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

రామారెడ్డి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి ఎ.ప్రకాష్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులతో మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా నాయకులు జమున, నాయకులు శివరామరాజు, లింబవ్వ, రాజవ్వ, పద్మ, లక్ష్మణ్, భూమియా, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని మౌలాన్‌ఖేడ్, సోమార్‌పేట్ గ్రామాలలో సోమవారం పశు వైద్యశిబిరం నిర్వహించినట్లు మండల పశువైద్యశాల సహాయ సంచాలకురాలు అర్చన తెలిపారు. ఈ శిబిరంలో 107 గేదెలు, 38 ఆవులు,ఎద్దులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాలలోని పశు పోషకులు, రైతులకు టీకాల ఆవశ్యకతను గురించి వివరించామని తెలిపారు. ముందస్తుగా టీకాలు వేయడం వలన పశువులకు సంక్రమించే కొన్ని రకాల రోగాల భారీ నుంచి పశువులను సంరక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి పశు వైద్యశాల సిబ్బంది, ఆయా గ్రామాల పశు పోషకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


టీకాలు వేస్తున్న పశు వైద్యశాల సహాయ సంచాలకురాలు అర్చన

తెరుచుకోని వ్యవసాయ అధికారి కార్యాలయం

● మండలంలోని ఆయా గ్రామాల రైతులకు తప్పని తిప్పలు

రామారెడ్డి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయం నాలుగు నెలల నుంచి తెరుచుకోవడం లేదు. గతంలో ఉన్న మండల వ్యవసాయ అధికారి ఈ కార్యాలయంలో విధులు సక్రమంగా నిర్వహించే వారు. అయితే నూతనంగా వచ్చిన వ్యవసాయ అధికారి ఈ కార్యాలయానికి రాకపోవడంతో రైతులకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న ఎలాంటి వసతులు లేని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారితో పాటు సహాయ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు మండల స్థాయిలో లేకపోయినప్పటికీ మండల ప్రత్యేక అధికారి కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఇలాంటి వాటికి ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న మండల వ్యవసాయ అధికారి కార్యాలయం చేర్చుకోవడంతో రైతులకు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించేందుకు వీలుగా ఉంటుందని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. కామారెడ్డి జిల్లాకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల వ్యవసాయ అధికారి కార్యాలయం ఇలా ఉంటే మిగతా కార్యాలయాలు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ప్రతిపక్ష నాయకులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. పేరుకే మాత్రం మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయం ఉన్నప్పటికీ ఏమాత్రం వసతులు సౌకర్యాలు లేని రైతులు కార్యాలయంలో విధులు నామమాత్రంగా నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.


రామారెడ్డిలోని మండల వ్యవసాయ అధికారి కార్యాలయం

ఇప్పటికైనా ఈ విషయమై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే, కామారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకొని రైతులకు మేలు చేయాలని కోరారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ వ్యవసాయ జిల్లా అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల వ్యవసాయ అధికారి కార్యాలయం ఇలా ఉంటే మిగతా కార్యాలయాలు ఎలా ఉంటాయి? అధికారుల పని ఎలా ఉంటుంది? దూరంలో ఉన్న మండలాలు ఎలా ఉంటాయని? అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మండల ప్రజలు కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భర్త హత్యకు ప్రియుడితో కలిసి కుట్ర

● వివరాలను వెల్లడించిన ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తనే హత్య చేయించేందుకు ప్రియుడితో కలిసి భార్య కుట్ర చేసిందని ఎస్పీ రాజేష్‌చంద్ర తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21న మాచారెడ్డి మండల పరిధిలోని పరిధ్‌పేట గ్రామ సమీపంలోని సోలార్ ప్లాంట్ వద్ద మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఘనపూర్ గ్రామానికి చెందిన సాడెం కుమార్ యువకుడిని ఐదుగురు వ్యక్తులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేష్ చంద్ర

అడ్డగించి ఇనుపరాడ్లతో తలపై దాడిచేసి హత్యా యత్నానికి ప్రయత్నించారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా ఏఎస్పీ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో మాచారెడ్డి పోలీసులు విచారణ జరపగా.. సాడెం రేణుక తన భర్త సాడెం కుమార్‌ను చంపేందుకు కుట్ర చేసిందని తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళపల్లి గ్రామ సమీపంలోని లలితమ్మ గుడిలో పూజారిగా పని చేస్తున్న కాంపల్లి మహేష్‌తో వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిపారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఎలాగైనా కుమార్‌ను చంపి ఆస్తి కాజేయాలని ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ఇందు కోసం అల్వాల్‌కు చెందిన మహమ్మద్ అశ్వాక్‌ను రూ.15 లక్షల సుపారికి ఒప్పించి, అతనికి, అతని అనుచరులలైన ముబిన్, అమిర్, అన్వర్, మోసిన్లకు అడ్వాన్స్‌గా రూ.2 లక్షలు ఇచ్చారని తెలిపారు. పథకం ప్రకారం కుమార్ కార్యాలయానికి వెళ్లే మార్గాన్ని గుర్తించి మాచారెడ్డి మండల పరిధిలోని పరిధ్‌పేటలో గల సోలార్ ప్లాంట్ వద్ద అనువైన ప్రదేశంగా గుర్తించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న కుమార్‌పై దాడిచేసి గాయపరిచారని తీవ్ర గాయాలపాలైన కారణంగా రక్తపు మడుగులో పడిపోయాడు. అయితే అదే సమయంలో ఆ వైపుగా కారులో వచ్చిన ఇద్దరు వ్యక్తుల కంటపడడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ కేసులో మొత్తం ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఒక కారు, ఒక ఆటో, ఒక గొడ్డలి, రెండు మోటార్ సైకిల్‌లు, నాలుగు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, కామారెడ్డి రూరల్ సీఐ రామన్, ఎస్ఐ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటీజన్స్‌కు సీట్లు కేటాయించాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో సీనియర్ సిటిజన్స్‌కు కేటాయించిన సీట్లను వారికే కేటాయించాలని ఆర్టీసీ డీపో మేనేజర్‌ను సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు పున్నరాజేశ్వర్ కోరారు. సోమవారం ఆర్టీసీ డీపోలో ఆమెను కలిసి ఈ విషయమై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో సీనియర్ సిటీజన్స్‌కు కేటాయించిన సీట్లలో వారినే కూర్చోనివ్వాలని ఇతరులను కూర్చోనివద్దని కోరారు. అలా జరగని పక్షంలో సంబంధిత కండెక్టర్ బాధ్యులు చేయాలని, ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని, టాయిలెట్స్‌ను పరిశుభ్రంగా ఉంచే ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న, ఉపాధ్యాక్షుడు నరసింహం, సంయుక్త కార్యదర్శులు మోహన్ రెడ్డి, రామ్‌కిషన్, రాజేశ్వర్ రెడ్డిలు, తదితరులు పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని భిక్కనూరు గ్రామంలో సోమవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎల్లారెడ్డి సొసైటి చైర్మన్ నర్సింలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన జొన్న పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే జొన్నలు విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని రైతులకు సూచించారు. ఎల్లారెడ్డి సొసైటి పరిధిలోని భిక్కనూరులో జొన్నల కొనుగోలు ఉపకేంద్రాన్ని రైతుల సౌకర్యార్థం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు సాయిరెడ్డి, బాపురెడ్డి, శ్రీకాంత్, మహేందర్, మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రామారెడ్డి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 1999-2000 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఆ తర్వాత 20 సంవత్సరాల నుంచి ఒకరికి ఒకరు గతంలో చేసిన పనులను, చదువులను వివరించుకొని బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సూరిబాబు పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను ఒకరికి ఒకరు కలిసి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో బీరప్ప ఉత్సవాలు

పిట్లం ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపూర్ గ్రామంలో ఘనంగా బీరప్ప ఉత్సవాలు గొల్ల, కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం బీరప్ప కామరతిల కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ హాజరై బీరప్ప పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకంగా పూజలు చేశారు. కుర్మ, గొల్ల సంఘం సభ్యులు ఎమ్మెల్యేకు గొంగడి, శాలువాలతో సన్మానం చేశారు. గ్రామస్థులు బీరప్ప పండగ సందర్భంగా ఉదయం నుంచి ఆలయానికి చేరుకొని ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హన్మాండ్లు, మహేందర్‌రెడ్డి, మల్లప్ప పటేల్, సాయిరెడ్డి, పాపిరెడ్డి, కుర్మ, గొల్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తాం : డీపీఎం

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఇందిరాక్రాంతి పథం కింద ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇబ్బందులు లేకుండా చూస్తామని ఐకేపీ డీపీఎం సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. డీపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశలో కొనుగోలు కేంద్రాలను సంఘాలకు అప్పగించడం జరిగిందని తెలిపారు. మండలంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ ఎలాంటి ఇబ్బందులు లేకుండ సజావుగా సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఎం దూప్‌సింగ్, సిసి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు వస్త్రాల పంపిణీ

లింగంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టేందుకు మండలంలోని డ్వాక్రా సంఘాలకు సోమవారం వస్త్రాలను పంపిణీ చేశారు. మహిళా సంఘాలు తీసుకున్న వస్త్రాలను కుట్టి జూన్ 12లోపు ఎంఆర్‌సీలో అప్పగించాలని ఎంఈవో శౌకత్ అలీ తెలిపారు. ఒక్కో యూనిఫాంకు రూ.75 ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఏకరూప దుస్తులు కుట్టే పనిని మహిళా సంఘాలకు అప్పగించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఎంఐఎస్ స్వాప్న, సీఆర్‌పీలు సత్యనారాయణ, గంగాధర్, రాజు, విజయ్, సంగాగౌడ్ సీసీలు గంగరాజు, శ్రావణ్, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై గ్రామీణులకు అవగాహన

లింగంపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గ్రామీణ ప్రజలకు సోమవారం సైబర్ నేరాలపై ఏఎస్సై ప్రకాశ్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల గురించి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పవద్దని, బ్యాంకు వివరాలు, ఆధార్ నెంబర్ వంటివి అడగినా గుర్తుతెలియని వ్యక్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వ వద్దని ఆయన తెలిపారు. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులలో మోసాలకు పాల్పడుతున్నారని, కొత్త వ్యక్తుల ఫోన్ నెంబర్లు సైతం లిఫ్ట్ చేసి మాట్లడవద్దని ఆయన హెచ్చరించారు. కార్యాక్రమంలో కానిస్టేబుల్స్ మదన్‌లాల్, జవిలతో పాటు సిబ్బంది ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : ఏపీఎం

మద్నూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా వ్యాపార పరంగా అన్ని రంగాలలో ముందుండాలని మద్నూర్ ఏపీఎం రవీందర్ సూచించారు. సోమవారం మండల సమాఖ్య సమావేశం అధ్యక్షురాలు సిద్ధబాయి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘాల పనితీరు, జీవనోపాదులు, వరి ధాన్యం కొనుగోలు, స్కూల్ యూనిఫామ్స్, బ్యాంకు రుణాలు, ప్రమాద భీమా, బ్యాంక్ లింకేజి రుణాలు, స్త్రీ నిధి రుణాలు రికవరీ, తదితర అంశాలపై చర్చించడం జరిగింది. అనంతరం ఏపీఎం మాట్లాడుతూ మహిళలు కూడబెట్టుకున్న ఒక్కో రూపాయి భరోసా ఇస్తుందని. వ్యాపార పరంగా ఎదుగుతున్న మహిళలు ఆర్థిక పాఠాలు నేర్చుకుంటున్నారని, పలు అంశాలపై వివరించారు.

పెద్దతడుగూర్‌లో అంబేద్కర్ జయంతి

మద్నూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు గుర్తు చేశారు. సోమవారం మద్నూర్ మండలం పెద్దతడుగూర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు సూచించిన మార్గం ఎప్పటికీ ఆదర్శప్రాయమైనదిగా నిలిచిపోతుందని, భారతదేశం గొప్ప ప్రజాస్వామ్య, గణతంత్ర, లౌకిక రాజ్యంగా వికసించడంలో అంబేద్కర్ గారు ఎనలేని కృషి చేశారన్నారన్నారు. దేశానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని, అసమానతలు లేని సమాజం కోసం ఆయన అనునిత్యం పరితపించారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకుని ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధన కోసం ప్రతఈ ఒక్కరం కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస పటేల్, కొండ రాజు, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న గ్రామస్థులు


ఎల్లారెడ్డిలో పరిశీలిస్తున్న సీఐ రవీందర్ నాయక్

రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాల పరిశీలన

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను పోలీసులు ఆర్‌అండ్‌బి అధికారులు సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్న రోడ్డు ప్రాంతాలను పరిశీలించారు. ప్రమాదాలు జరగడానికి గల కారణాలను తెలుసుకొని నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. ఇందులో ఆయనతో పాటు మున్సిపల్, రోడ్డు భవనాల శాఖ, మండల పరిషత్, పోలీసులు ఎస్ఐ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

బీర్కూర్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన భూత్‌పిల్లి మహేష్(25) అనే యువకుడు ఆదివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మహేష్ కు గత కొన్నాళ్ల క్రితం వివాహం జరిగింది. ఒక కుమార్తె కూడా ఉంది. మహేష్ పని పాట లేకుండా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిస అయ్యాడు. మద్యం మానేయాలని ఎన్నిసార్లు చెప్పినా పెడచెవిన పెట్టేవాడు. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం వేసవి సెలవులు కావడంతో మహేష్ తన భార్య, కుమార్తెలను పుట్టింటికి సాలురకు పంపించాడు. రోజులాగే ఆదివారం మహేష్ ఫుల్లుగా మద్యం తాగి రాత్రి ఇంటికి వచ్చాడు. భోజనం చేసి ఇంట్లో నిద్రించాడు. అతడి తల్లి డాబాపై నిద్రించింది. ఉదయం తల్లి ఇంట్లోకి వచ్చి చూడగా మహేష్ తాడుతో ఉరి వేసుకుని కనిపించాడు. లబోదిబోమంటూ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి తల్లి, భార్య, ఒక కుమార్తె ఉన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మహేష్ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డుపై మురికి నీరు తొలగింపు

నసురుల్లాబాద్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ సెక్రటరీలు గ్రామాలకు రాక గ్రామాలన్నీ అపరిశుభ్రంగా ఉండడంతో పాటు వీధులను కంపు కొడుతున్నాయని ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పత్తాలేని ప్రత్యేక అధికారులు' అనే కథనానికి సోమవారం గ్రామ పంచాయతీ సెక్రెటరీ సరిత స్పందించారు. దుర్కి గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీటిని పారిశుధ్య కార్మికులతో తొలగించారు. కాలనీ సమస్యను పరిష్కరించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

టైర్ పగిలి చెట్టుకు ఢీకొట్టిన కారు

బీర్కూర్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో రోడ్డు పై వెళ్తున్న కారు టైర్ పగిలింది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనానికి తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని టీటీడీ క్షేత్రానికి వచ్చాడు. దర్శనం అనంతరం బోధన్‌కు కారులో తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని బారడి పోశమ్మ ఆలయం వద్ద కారు టైర్ పేలింది. కారు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్లకు ఢీకొట్టింది. కార్ ఎయిర్ బెలూన్‌లు ఓపెన్ కావడంతో కారులో ఉన్న వారందరూ చిన్నపాటి గాయాలతో బయట పడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వదల్పర్తి గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించే ప్రయత్నం చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా వదల్పర్తి గ్రామ శివారులోని వాగు నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్టు సమాచారం అందించడంతో వెంటనే పోలీసు సిబ్బందితో వదల్పర్తి వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లు అక్రమ ఇసుక తరలించే ప్రయత్నం చేస్తుండగా వాటిని పట్టుకున్నట్టు ఎస్సై తెలిపారు. అయ్యపల్లి, ఎక్కపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు పోచబోయిన భాస్కర్, ఎల్లమొల్ల సాయిలు ఇద్దరు టాక్టర్ల ద్వారా అక్రమ ఇసుకను తరలించే ప్రయత్నం చేశారని, ఒక ట్రాక్టర్లో ఇసుకను లోడ్ చేశారని ఆయన తెలిపారు. దీంతో అక్రమంగా ఇసుకను తరలించి రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - జిమ్ ఖానా
ప్రియా 70 - అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
ప్రియా 35 - సారంగాపాని జాతకం

బాన్సువాడ

మహేశ్వరి - ఓదెల 2
వెంకటేశ్వర - ఒక్కడు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

